జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 1 | జూన్ | 2026 ◆ పేజీలు : 7




## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్/ పాల్వంచ, మే 31 (ప్రజా జ్యోతి)** నేడు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను

మిగతా 2 లో...

- నిధులు విడుదల... నిర్మాణం నిలిచి పోవడమేలా ?
- భక్తుల కలలకు ప్రభుత్వం తోడు
- వైదిక ప్రక్రియలు పూర్తి
- అభివృద్ధి మాత్రం పెండింగ్
- టెండర్ల వద్దే ఆగిన అభివృద్ధి రథం
- వర్షాకాలం ముందే మొదలవుతాయా పనులు ?
- పుష్కరాల నాటికి లక్ష్యం చేరుతుందా ?
- ఆర్ అండ్ బి శాఖపై పెరుగుతున్న అంచనాలు
- రామభక్తుల చూపు భద్రాద్రిపైనే

7 లో..





# టెండర్ జరిగితేనే వండర్..

దేవతలు కదిలారు... కానీ యంత్రాలు కదల్లేదు. నిధులు విడుదలయ్యాయి... కానీ నిర్మాణం మొదలుకాలేదు. దక్షిణ అయోధ్యగా ఖ్యాతిగాంచిన భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని దేశంలోనే అత్యున్నత ఆధ్యాత్మిక కేంద్రాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చరిత్రలోనే భారీ అభివృద్ధి ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. కోట్లాది రూపాయల నిధులను కేటాయించింది. స్థల సేకరణ పూర్తి చేసింది. శాస్త్రోక్తంగా జీర్ణోద్ధరణ అనుజ్ఞ కార్యక్రమాలు నిర్వహించింది. ఉపాలయాల్లోని దేవతామూర్తులను సైతం ప్రత్యేక ప్రాంగణానికి తరలించింది. అయితే అభివృద్ధి పనులకు సంబంధించిన అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తయినప్పటికీ అసలు నిర్మాణ పనులు మాత్రం ఇంకా ప్రారంభం కాకపోవడం రామభక్తులను ఆందోళనకు గురిచేస్తోంది.

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి (భూక్యా రంజిత్ రంజిత్)

## వైభవంగా శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సవం

- గోవింద నామస్మరణలతో మారుమ్రోగిన దమ్మపేట



**దమ్మపేట, మే 31 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండల కేంద్రంలోని శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. ఆలయంలో నిర్వహించిన శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం కనుల పండుగగా సాగి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యుత్ దీపాలు, పుష్పాలంకరణలతో ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీనివాస స్వామి, పద్మావతి అమ్మవార్ల దివ్య కళ్యాణాన్ని వేద పండితులు రామకృష్ణ చార్యులు, అఖిల్ కుమారాచార్యులు, రాఘవాచార్యులు, రంగరాజ మన్నర్, వాసు తదితరులు వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు దమ్మపేటతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా అశ్వారావు పేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు

మిగతా 2 లో...

## రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం సాధ్యం

- ఇచ్చినా ప్రతి ఒక్క హామీ తప్పనిసరిగా అమలు: ఎమ్మెల్యే



**ఇల్లందు, మే 31, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. ఆదివారం ఇల్లందు మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు వివో భవనాలకు రూ. 20 లక్షలు, రెండు అంగన్వాడి భవనాలకు రూ. 30 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లతో లబ్ధిదారుల కండ్లలో ఆనందం వెల్లివిరుస్తుందని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత పరిస్థితులకు అనుగుణంగా అమలు చేయడం జరుగుతుందని గుర్తు చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యత

మిగతా 2 లో...

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

(మొదటి పేజీ తరువాయి...)

సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కావున సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం సాధ్యం





(మొదటి పేజీ తరువాయి...)

ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నూతన రేషన్ కార్డులతో పాటు నూతన పెన్షన్లను అందజేయడం జరుగుతుందని, అదేవిధంగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో కాలయాపన చేయదని, ఇచ్చిన ప్రతి మాటను తప్పనిసరిగా అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మండల రాము, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భోళ్ల సూర్యం, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం





(మొదటి పేజీ తరువాయి...)

తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, అనంతరం అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఆలయ చైర్మన్ పసుమర్తి రామభద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# త్యాగాల వారసత్వానికి ప్రతీక కాసాని ఐలయ్య

- **ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటమే కాసానికి ఘన నివాళి**
- **దోపిడీ రహిత సమాజం కోసం చివరి శ్వాస వరకు పోరాడిన యోధుడు: బీవీ రాఘవులు**
- **కొత్తగూడెం,సుజాతనగర్‌లో ఐలయ్య స్మారక స్తూపాల ఆవిష్కరణ**
- **భారీ బైక్ ర్యాలీ, ప్రదర్శనలు, ఘన నివాళులు**






**కొత్తగూడెం, మే 31 ( ప్రజాజ్యోతి )** ప్రజా సమస్యల పరిష్కారానికి జీవితాంతం రాజీలేని పోరాటం చేసిన కమ్యూనిస్టు నాయకుడు, సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తొలి కార్యదర్శి కాసాని ఐలయ్యకు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా స్థానం ఉందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. ప్రజల కోసం త్యాగమే జీవిత ధ్యేయంగా భావించి ఆర్థిక అసమానతలు, దోపిడీ లేని సమాజం కోసం తన తుదిశ్వాస వరకు పోరాడిన మహోన్నత వ్యక్తి కాసాని ఐలయ్య అని కొనియాడారు. కాసాని ఐలయ్య స్మారక స్తూపావిష్కరణ కార్యక్రమాలు ఆదివారం కొత్తగూడెం, సుజాతనగర్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెంలోని సెవెన్ హిల్స్ సమీపంలో నిర్మించిన కాసాని ఐలయ్య స్మారక స్తూపాన్ని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం. సాయిబాబు ఆవిష్కరించగా వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ జెండావిష్కరణ చేశారు. అనంతరం కొత్తగూడెం నుంచి సుజాతనగర్ వరకు సీపీఎం శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించాయి. కాసాని ఆశయాలు కొనసాగిద్దాం, ప్రజా పోరాటాలే నిజమైన నివాళి అంటూ నినాదాలతో కార్యకర్తలు ముందుకు సాగారు. సుజాతనగర్‌లో నిర్మించిన కాసాని ఐలయ్య స్తూపాన్ని బీవీ రాఘవులు ఆవిష్కరించారు. ధన్వంతరి కళాశాల నుంచి శ్రీదుర్గా ఫంక్షన్ హాల్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు.

### ››› కాసాని లేని లోటు పార్టీకి తీరనిది

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కున్సోత్ ధర్మ అధ్యక్షతన జరిగిన సభలో బీవీ రాఘవులు మాట్లాడుతూ ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి పోరాడిన కాసాని ఐలయ్య లాంటి నాయకుడిని కోల్పోవడం పార్టీకి తీరని లోటని అన్నారు. సామాన్య కుటుంబం నుంచి ఎదిగి ప్రజా జీవితాన్ని అధ్యయనం చేసి ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేసిన నాయకుడిగా కాసాని నిలిచిపోయారని చెప్పారు. ప్రజల్లో అపార విశ్వాసాన్ని సంపాదించిన కాసాని ఐలయ్యను కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణ దశలో ఎన్నో దాడులు ఎదురైనా ప్రజలే కంటికి రెప్పలా కాపాడుకున్నారని గుర్తు చేశారు. ప్రజలతో ఏర్పరచుకున్న ఆ నమ్మకాన్ని పార్టీ కార్యకర్తలు మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

### ››› సుజాతనగర్ అభివృద్ధికి పునాదులు వేసిన ప్రజా నాయకుడు

సుజాతనగర్ సర్పంచ్‌గా పనిచేసిన కాలంలో ప్రజల డబ్బును ప్రజలకే ఖర్చు చేయాలనే ధోరణితో కాసాని పనిచేశారని, నేడు ఆ ప్రాంతంలో కనిపిస్తున్న అభివృద్ధికి ఆయన వేసిన పునాదులే కారణమని రాఘవులు పేర్కొన్నారు. వ్యక్తిగత సుఖసౌకర్యాల కోసం కాకుండా ప్రజల కోసం జీవించిన త్యాగధనుడిగా కాసాని చరిత్రలో నిలిచిపోతారని అన్నారు.

### ››› ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు అవసరం

దేశంలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, పేదరికం, సామాజిక అణచివేతలపై కాసాని స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలని రాఘవులు పిలుపునిచ్చారు. కార్పొరేట్, మతోన్మాద విధానాల కారణంగా ప్రజల ఆదాయాలు తగ్గి నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని విమర్శించారు. ఇరాన్–అమెరికా ఉద్రిక్తతల ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఇంధన రంగంపై పడుతోందని, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధాలకు వ్యతిరేకంగా శాంతి కోసం ప్రజాస్వామ్య శక్తులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

### ››› రైతులు, కార్మికుల ప్రయోజనాలు కాపాడాలి

భారత్–అమెరికా వాణిజ్య చర్చల నేపథ్యంలో విదేశీ వ్యవసాయ, పాల ఉత్పత్తుల దిగుమతుల వల్ల దేశీయ రైతులు, పాల ఉత్పత్తిదారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలను కాపాడే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని సూచించారు. కార్మిక వ్యతిరేక చట్టాలపై దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఉద్యమబాట పట్టిందని, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిఘటన పెరుగుతోందని తెలిపారు. ఆ పోరాటాలకు కమ్యూనిస్టులు నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు.

### ››› కేరళ మోడల్ దేశానికి ఆదర్శం

కేరళలో సీపీఎం ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను కాపాడుతూ కేంద్ర విధానాలను ధైర్యంగా ఎదుర్కొంటోందని రాఘవులు అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం విషయంలో కేరళ దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాడిన నాయకులను ప్రజలు ఎప్పటికీ మరచిపోరని, కాసాని ఐలయ్య పేరు కొత్తగూడెం, సుజాతనగర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం. సాయిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన ్ రావు, నున్నా నాగేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, లిక్కి బాలరాజు, కే. బ్రహ్మచారి, నర్సారెడ్డి, సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు, జిల్లా కమిటీ సభ్యులు వీర్ల రమేష్, గడ్డం స్వామి, భూక్య రమేష్, యాస నరేష్, కొండబోయిన వెంకటేశ్వర్లు, ముదిగొండ రాంబాబు, నాయకులు కాట్రాల తిరుపతిరావు, నర్రా శివరామకృష్ణ, గండమాల భాస్కర్, కుమారి, కొండే కృష్ణ, 21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి, న్యాయవాదులు జలసూత్రం శివరాం, ప్రసాద్ రెడ్డి, పురుషోత్తం, నాగరాజు, వెంకటేష్, నాగరత్నమ్మ, నల్లగోపు పుల్లయ్య, గోవర్ధన్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామదీపికల నిరవధిక సమ్మెకు గాయత్రి హాస్పిటల్ మద్దతు

- **10వ రోజు సమ్మెలో పాల్గొన్న గ్రామదీపికలకు భోజన ఏర్పాటు**



**దమ్మపేట,మే.31(ప్రజాజ్యోతి ):** దమ్మపేట మండల కేంద్రంలో కొనసాగుతున్న గ్రామదీపికల నిరవధిక సమ్మె 10వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె చేస్తున్న గ్రామదీపికలకు సంఘీభావం ప్రకటిస్తూ గాయత్రి హాస్పిటల్ యాజమాన్యం భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.గ్రామదీపికల న్యాయమైన డిమాండ్ల సాధనకు తమ పూర్తి మద్దతు ఉంటుందని హాస్పిటల్ ప్రతినిధులు తెలిపారు. సమ్మెలో పాల్గొంటున్న గ్రామదీపికలకు భోజనం అందించి వారి పోరాటానికి సంఘీభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గాయత్రి హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ మౌనిక (గైనకాలజిస్ట్), డాక్టర్ సాయికృష్ణ, హాస్పిటల్ యాజమాన్య ప్రతినిధులు అజీమ్, విజయ్, రఫీ, మధు తదితరులు పాల్గొన్నారు.గ్రామదీపికల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వారి సేవలకు తగిన గుర్తింపు కల్పించాలని ఈ సందర్భంగా వారు కోరారు. సమ్మెలో పాల్గొన్న గ్రామదీపికలు గాయత్రి హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

# భద్రాద్రి రామాలయంలో భక్తుల రద్దీ

- సరైన సౌకర్యాలు అందక భక్తుల ఇక్కట్లు
- రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం





**భద్రాచలం టౌన్, మే 31, ప్రజాజ్యోతి** భద్రాచలంలో ఆదివారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో రామాలయంతో పాటు ఆలయ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. ఇటీవల కాలంలో శ్రీరామనవమి తరువాత ఇంత అధిక సంఖ్యలో భక్తులు రావడం గమనార్హం. భక్తులు తెల్లవారుజాము నుంచే పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించి రామయ్య దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారు. భక్తుల సంఖ్య అధికంగా ఉండటంతో దేవస్థానంలో ఆర్జిత సేవలన్నీ రద్దు చేసి నేరుగా భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. ఉచిత దర్శనంతో పాటు రూ.100 శీఘ్ర దర్శనంపై భక్తులను అనుమతించారు. అలాగే రూ.100 శీఘ్ర దర్శనం టికెట్లు అధికంగా జారీ చేయడంతో భక్తులు ప్రధాన ఆలయంతో పాటు చిత్రకూట మండపం వరకు వచ్చేసారు. దీంతో భక్తులను ఇతర మార్గాల్లో సైతం అనుమతిస్తూ త్వరగా దర్శనమయ్యేలా చూసారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో దేవస్థానం సరైన ఏర్పాట్లు చేయలేదని పలువురు భక్తులు విమర్శిస్తున్నారు. ఎండ వేడిమికి క్యూలైన్లలో ఉన్న వారికి అరకొర తాగునీరు మాత్రమే అందజేశారని, మజ్జిగ సైతం మెట్ల దగ్గరల్లో ఉన్న వారికి మాత్రమే ఇచ్చారని భక్తులు ఆరోపిస్తున్నారు. భక్తుల రద్దీ సమయంలో సిబ్బందిని పెంచి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సి ఉండగా నామమాత్రంగా ఉండటంతో భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. అలాగే లడ్డూల కౌంటర్లను దేవస్థానం భక్తుల రద్దీకి అనుగుణంగా పెంచకపోవడంతో లడ్డూ క్యూలైన్లలోనే ఎక్కువ సమయం గడపాల్సి వచ్చింది. మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగగా అనంతరం సాధారణ స్థితికి చేరుఇంది. అలాగే సాయంత్రం సైతం భక్తుల రద్దీ అధికంగానే ఉంది. దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం**

ఆదివారం సందర్భంగా రామాలయంలో భద్రాద్రి రామయ్యకు ప్రత్యేక అభిషేకం, నిత్యకల్యాణం నిర్వహించారు. నిత్యకల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేన అర్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకరబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

## తనకు దొరికిన మొబైల్‌ఫోన్‌ని యజమానికి అందజేసిన ప్రసాద్



**భద్రాచలం టౌన్, మే 31, ప్రజాజ్యోతి** భద్రాచలంలోని మార్కెట్ యార్డులో శనివారం ఫోన్ పోగొట్టుకున్న ఓ లారీ డ్రైవరు ఫోను పోగొట్టుకున్నారు. ఆ ఫోను ఎమ్మార్పీస్ నాయకులు పులి ప్రసాద్‌కు దొరడంతో సోమవారం లారీ డ్రైవరు బంధువుకు తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కు లారీ డ్రైవరుకు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి మంచి మనసున్న వారు సమాజంకు ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు.

## ఐటీడీఏలో గిరిజన దర్బార్

- సబ్‌కలెక్టరేట్‌లో ప్రజావాణి

**భద్రాచలం టౌన్, మే 31 ప్రజాజ్యోతి** భద్రాచలంలో సోమవారం నాడు ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్, సబ్‌కలెక్టరు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాల్, సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధిత అధికారులందరూ ఉదయం 10.30 కల్లా హాజరు కావాలని కోరారు. దరఖాస్తులు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా అందజేయాలని పేర్కొన్నారు.

## టియుడబ్ల్యూజె (టిజెఎఫ్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**ఇల్లందు, మే 31, ప్రజాజ్యోతి:** తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో ముందుకు సాగుతున్న తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టిజెఎఫ్) 25వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం అ యూనియన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జగదాంబ సెంటర్ లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల త్యాగాలను స్మరిస్తూ కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజె (టిజెఎఫ్) డివిజన్ అధ్యక్షుడు గుర్రం రాజేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాదిమంది అమరులయ్యారని గుర్తు చేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో 2001 మే 31న తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టిజెఎఫ్) ఆవిర్భవించిద్దని తెలిపారు. ఆంధ్ర పెత్తందారులు తెలంగాణ సంపదను తరలించుకు పోయేందుకు కుట్రలు జరుగుతున్నాయని, నీళ్లు, నిధులు, నియామకాలు తెలంగాణ ప్రాంత ప్రజలకు అందే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ జర్నలిస్ట్ ల పాత్ర ఎంతో ఉందని పేర్కొన్నారు. జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉంటూ పోరాటాలు చేస్తేనే హక్కులు సాధించడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజె (టిజెఎఫ్) సభ్యులు చాగర్ల సంతోష్, బత్తుల రాధాకృష్ణ, ఇల్లందుల నాగేశ్వరరావు, అబ్బూరి డానియల్, మాటేటి మధు బాబు, తాడూరి శేఖర్, వి రాజు, సాధనపల్లి నందు, ఏఎస్ రావు, రఫీ, కల్లేపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఇరప వంశ మహా జాతరకు సర్వం సిద్ధం

- శిర్రాజు–బాలరాజు జాతరకు ఆహ్వానం

**చర్ల, మే 31(ప్రజా జ్యోతి ):** ఆదివాసి కోయ సమాజానికి చెందిన ఇరప వంశ స్థల ఆరాధ్య దైవాలైన శిర్రాజు బాలరాజు మహా జాతర ఈ నెల 31 నుంచి జూన్ 3 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు జాతర నిర్వాహకులు తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో నివసిస్తున్న ఇరప వంశస్థులు కుటుంబ సమేతంగా జాతరకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఇరప వంశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, గొట గోత్రాలు వాటి వరసలను యువతకు పరిచయం చేయడమే జాతర ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జూన్ 2న కోయ సమాజ మూలాలు, ఇరప వంశ పూర్వచరిత్ర, వివిధ ఇంటిపేర్ల ఆవిర్భావంపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. జాతరలో భాగంగా ప్రత్యేక పూజలు, ఇలవేల్పు శక్తుల ఆహ్వానం, మొక్కుబడుల చెల్లింపు, శుంకులు పోయడం, గంగాస్నానం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. మే 31న ఆతి పూజ, జూన్ 1న గుడి అలంకరణ, ఇలవేల్పు శక్తుల ఆహ్వానం, జూన్ 2న పూర్వచరిత్ర సమావేశం, పెద్దపండుగ, జూన్ 3న మొక్కుబడులు, గంగాస్నానం, వనప్రవేశ కార్యక్రమాలతో జాతర ముగియనుంది అని తెలియచేసారు.

## పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

- ఆరుగురు అరెస్ట్



**ఇల్లందు, మే 31, ప్రజాజ్యోతి:** మండలంలోని ముకుందాపురం గ్రామంలో పేకాట స్థావరంపై ఆదివారం టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ దాడుల్లో 6 గురు పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ. 48 వేల 920 నగదు, 5 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని నిందితులను ఇల్లందు పోలీస్ స్టేషన్ కు తరలిస్తున్నట్లు తెలిసింది. ఈ దాడులలో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, సబ్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్, సుమంత్, రామారావు, ఇల్లందు పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం తొలగింపుపై ఎమ్మార్పీఎస్ ఆగ్రహం



**పినపాక, మే 31, (ప్రజాజ్యోతి ):** అశ్వాపురం మండల ప్రధాన రహదారిపై ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించిన ఘటనపై ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు వల్లేపోగు వెంకటేశ్వర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పినపాక మండలం ఎల్చిరెడ్డిపల్లి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసిన ఆయన అనంతరం మాట్లాడుతూ, అంబేద్కర్ విగ్రహాన్ని అవమానకరంగా ఒక పక్కకు పారవేయడం అత్యంత బాధాకరమని అన్నారు. దేశానికి అంబేద్కర్ అందించిన సేవలు అమూల్యమైనవని, ఆయన ఆశయాలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అలాంటి మహనీయుడి విగ్రహాన్ని తొలగించాల్సి వచ్చినా గౌరవప్రదంగా వ్యవహరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే తగిన స్థలాన్ని గుర్తించి అంబేద్కర్ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, అంబేద్కర్ అభిమానులు, గ్రామస్తులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను జూన్ 2 నుండి అమలుచేయాలి

- ప్రగతిశీల యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్



**టేకులపల్లి, మే31, ప్రజాజ్యోతి :** తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలను తక్షణమే అమలు చేయాలి అని ప్రగతిశీల యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారులు హైకోర్టులో ప్రభుత్వంపై కేసు వేసిన సందర్భంగా తక్షణమే ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని హైకోర్టు తీర్పునివ్వడం జరిగింది. దీనికి సంబంధించి 8 వారాల గడువు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఇవ్వడం జరిగింది. హైకోర్టు తీర్పులో ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు, పెన్షన్ తదితర హామీలను తక్షణమే అమలు చేయాలని ఆదేశించడం జరిగింది. హైకోర్టు తీర్పును గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిజమైన ఉద్యమ కారులను గుర్తించి వారికి ఇచ్చిన హామీలను చేయాలని పి వై ఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## హెల్త్ కార్డుల కోసం జీతంలో కోత విధించడం సరికాదు

- ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలి.లేనిచో ఉద్యమం తప్పదు
- టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్



**టేకులపల్లి, మే31, ప్రజాజ్యోతి:** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆరోగ్య పథకానికి సంబంధించి అధికారికంగా హెల్త్ కార్డులు జారీ చేయకుండానే ముందస్తుగా ఆర్థికశాఖ మే నెల జీతంలో కోతలు విధించడాన్ని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్ ఖండించారు. ఇంతవరకు ఆర్థిక శాఖ విధివిధానాలను ప్రకటించకుండానే,ఏ హాస్పిటల్స్ ఈ స్కీం కింద వర్తిస్తాయో తెలపకుండానే, ఎలాంటి వ్యాధులకు సంబంధించి చికిత్సలు చేస్తారో తెలపకుండానే, ముందస్తుగా ఉద్యోగుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే కోతలు విధించారు అని ఆరోపించారు.దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వారు తెలిపారు.ఆరోగ్యశాఖకు సంబంధించిన వెబ్సైట్లో ఉద్యోగుల వివరాలు కూడా పూర్తిగా నమోదు కాలేదని, మే 31 వరకు నమోదు చేయడానికి అవకాశం ప్రభుత్వం ఇచ్చిందని, ఇంతవరకు పూర్తిగా నమోదు కాకుండానే ఏ విధంగా కోత విధిస్తారని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.భార్యాభర్తలు ఉద్యోగులైన పక్షంలో ఏ విధంగా నమోదు చేసుకోవాలో ఇంతవరకు ఎలాంటి పూర్తిస్థాయి వివరణ అందుబాటులో ఉంచలేదని అని అన్నారు. అదేవిధంగా మే 30 వరకు కూడా వెబ్సైట్లో చాలా మార్పులు చేశారని, పూర్తిస్థాయి మార్పులు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు తెలియజేస్తున్న తరుణంలో,చడి చప్పుడు లేకుండా జీతంలో కోత విధించడం అన్యాయమని వారు వాపోయారు. ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల ద్వారా అభిప్రాయాలను సేకరించి,ఆరోగ్య కార్డుల జారీలో మార్గదర్శకాలు తయారు చేసి,విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా ఎవరైతే ఈ పథకంలో చేరడానికి ఆసక్తి చూపుతారో వారికే కోత విధించాలని,ఇష్టం లేని వారికి కోత విధించకుండా నిబంధనలు తయారు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తనకు తానుగా ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్యానికి సంబంధించి రక్షణ తీసుకోవాల్సిన బాధ్యత నుంచి తప్పించుకునే క్రమంలో ఒక కొత్త విధానానికి శ్రీకారం చుడుతూ,ఉద్యోగుల నుంచి ప్రీమియం చెల్లింపును కోరింది.దీనిని కొన్ని సంఘాలు వ్యతిరేకించాయి అని తెలిపారు. ప్రభుత్వం ఆరోగ్య కార్డులు జారీకి సిద్ధమైంది.కానీ అందరూ ఉద్యోగులకు ఆరోగ్య కార్డుల కొరకు కోత విధించడం అన్యాయమని,ఉద్యోగుల దగ్గర ఆప్షన్ తీసుకొని మాత్రమే కోతలు విధించాలని వారు డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఇప్పుడు నెల జీతంలో ముందస్తుగానే కోత విధించారనీ,ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని విధించిన కోతను మళ్ళీ మే నెల జీతంలో కలిపి చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమం చేయడానికి సిద్ధమవుతున్నామని వారు తెలిపారు.

## ఉపాధ్యాయుల జీతం కోత విధించడం సరికాదు




**టేకులపల్లి,మే31,ప్రజాజ్యోతి:** రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ ఉద్యోగుల ఆరోగ్య భద్రత పథకం( ఈహెచ్ఎస్) పేరుతో ఉపాధ్యాయినీ ఇబ్బంది పెట్టడం మంచి పద్ధతి కాదని టీఎస్సిపిఎస్ఈయు మండల శాఖ నాయకులు ఖండించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల ద్వారా అభిప్రాయాలను సేకరించి,ఆరోగ్య కార్డుల జారీలో మార్గదర్శకాలు తయారు చేసి,విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా ఎవరైతే ఈ పథకంలో చేరడానికి ఆసక్తి చూపుతారో వారికే కోత విధించాలని,ఇష్టం లేని వారికి కోత విధించకుండా నిబంధనలు తయారు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తనకు తానుగా ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్యానికి సంబంధించి రక్షణ తీసుకోవాల్సిన బాధ్యత నుంచి తప్పించుకునే క్రమంలో ఒక కొత్త విధానానికి శ్రీకారం చుడుతూ,ఉద్యోగుల నుంచి ప్రీమియం చెల్లింపును కోరారు.దీనిని కొన్ని సంఘాలు వ్యతిరేకించాయి అనివారు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఎస్సిపిఎస్ఈయు సంఘం నాయకులు బానోత్ నాగునాయక్, రమణ, బాలాజీ రవి, హతీరామ్ పాల్గొన్నారు.

# మూతపడిన పల్లె ప్రకృతి వనం...!

- ప్రకృతి వనానికి తాళం
- నిర్వహణ లేక ఎండిపోతున్న మొక్కలు
- ప్రజలకు అందని ప్రకృతి వనం
- వనం తెరవాలంటున్న ప్రజలు



**చర్ల, మే 31 (ప్రజాజ్యోతి)**
చర్ల మండల కేంద్రంలో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం గత కొన్ని రోజులుగా మూతపడడంతో స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు లక్ష్యాలతో ఏర్పాటు చేసిన ఈ వనం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది.ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, వ్యాయామం, యోగా, విశ్రాంతి కోసం ప్రజలు పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించేవారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు తమ ఖాళీ సమయాన్ని ప్రకృతి ఒడిలో గడిపేందుకు ఈ వనాన్ని వినియోగించుకునేవారు. అయితే గత కొన్ని రోజులుగా వనం ప్రధాన ద్వారాలకు తాళాలు వేసి ఉండటంతో సందర్శకులు నిరాశతో నుదిరుగుతున్నారు.వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వనంలోని మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం, సంరక్షణ చర్యలు చేపట్టడం అత్యవసరంగా మారింది. అయితే ప్రస్తుతం వనం మూసివేయబడటంతో పాటు నిర్వహణ పనులు కూడా సక్రమంగా జరగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలు చోట్ల మొక్కలు వాడిపోవడం, కొన్ని మొక్కలు పూర్తిగా ఎండిపోవడం కనిపిస్తోందని చెబుతున్నారు. లక్షల రూపాయల ప్రజాధనంతో నాటిన మొక్కలు సంరక్షణ లేక నశించే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పల్లె ప్రకృతి వనం ఏర్పాటు సమయంలో పచ్చదనం పెంపు, గ్రామీణ ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యత, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం వంటి లక్ష్యాలను అధికారులు ప్రకటించారు. అందుకు అనుగుణంగా అనేక రకాల నీడనిచ్చే మొక్కలు, పూల మొక్కలు, ఔషధ మొక్కలను నాటడంతో పాటు వాకింగ్ ట్రాక్లు, కూర్చునే ఏర్పాట్లు కూడా చేశారు. ప్రారంభ దశ నుంచి ప్రజలలో మంచి స్పందన లభించినప్పటికీ ప్రస్తుతం నిర్వహణ లోపంతో వనం తన ఉనికిని కోల్పోతున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.వనాన్ని మూసివేయడానికి గల కారణాలపై సంబంధిత అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం కూడా ప్రజల్లో అసంతృప్తికి కారణమైంది. మరమ్మతుల కోసమా, నిర్వహణ పనుల కోసమా, లేక ఇతర కారణాల వల్లనా మూసివేశారో స్పష్టత లేకపోవడంతో ప్రజలు సందిగ్ధంలో ఉన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రదేశాన్ని ఎటువంటి ప్రకటన లేకుండా మూసివేయడం సరైన విధానం కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం మండలంలో తీవ్రమైన ఎండలు కొనసాగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పల్లె ప్రకృతి వనం ప్రజలకు కొంత ఉపశమనం కలిగించే ప్రదేశంగా ఉండేది. సాయంత్రం వేళల్లో కుటుంబ సభ్యులతో కలిసి వనానికి వచ్చే వారు ఇప్పుడు నిరాశ చెందుతున్నారు. పిల్లలకు ప్రకృతి గురించి అవగాహన కల్పించే అవకాశం కూడా దూరమవుతోందని పలువురు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా నిలవాల్సిన పల్లె ప్రకృతి వనం నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించడం దురదృష్టకరమని స్థానికులు అంటున్నారు. వెంటనే సంబంధిత పంచాయతీ అధికారులు, గ్రామ పంచాయతీ పాలక వర్గం, ఉన్నతాధికారులు స్పందించి వనాన్ని పరిశీలించాలని కోరుతున్నారు. ఎండిపోతున్న మొక్కలకు నీటి సదుపాయం కల్పించి, శుభ్ర త చర్యలు చేపట్టి, వనాన్ని తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం మూతపడ టం వల్ల దాని అసలు లక్ష్యం దెబ్బతింటోందని వనాన్ని వెంటనే తెరిచి ప్రజలకు అందుబాటులో ఉంచడంతో పా టు మొక్కల సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కోరుతున్నారు.

## ఘనంగా ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం





**టేకులపల్లి,మే31, ప్రజాజ్యోతి:** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజలు పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని స్థానిక వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్ పిలుపునిచ్చారు. టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్ రోడ్ సులానగర్ ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ కంచర్ల వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పొగాకు ఆరోగ్యానికి అత్యంత హానికరమైన వ్యసనా పదార్థమని దీనిలో నికోటిన్ అనే రసాయనిక పదార్థం వల్ల దీనికి వ్యసనపరులుగా మారుతారని సిగరెట్లు, బీడీలు, గుట్కా, పాన్ మసాలా వంటి పొగాకు ఉత్పత్తులు వాడటం వల్ల ప్రధానంగా నోటి క్యాన్సర్, నాలుక క్యాన్సర్,గొంతు క్యాన్సర్,ఊపిరితిత్తుల క్యాన్సర్, ఆహారనాళం క్యాన్సర్,పొట్ట క్యాన్సర్, మూత్రశయ క్యాన్సర్,గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధులు,స్ట్రోక్ వంటి తీవ్రమైన అనారోగ్య సమస్యలకు ప్రధాన కారణమవుతున్నాయని అని అన్నారు.పొగాకులు దగ్గర దగ్గరగా7000 రకాల రసాయనాలు ఉంటాయని వాటిలో 70 రకాల రసాయనాలు క్యాన్సర్ కారకాలుగా పనిచేస్తాయని తెలిపారు.యువత పొగాకు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. పొగాకు వినియోగం వల్ల ఆరోగ్య నష్టం మాత్రమే కాకుండా కుటుంబ ఆర్థిక పరిస్థితిపై కూడా తీవ్రమైన ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకొని పొగాకు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పొగాకు నియంత్రణ చట్టాలను ప్రతి ఒక్కరూ పాటించాలని అని అన్నారు. ప్రజలు తిరుగుతున్న బహిరంగ ప్రదేశాలలో ధూమపానం చేయరాదని అన్నారు.విద్యార్థులకు పొగాకు వాడకం వల్ల వచ్చే తీవ్రమైన అనర్థాలపై నిరంతరం వైద్య సిబ్బంది అవగాహన కనిపిస్తూనే ఉంటారు. అనంతరం సిబ్బందితో పొగాకు పదార్థాలను నియంత్రించేందుకు నా వంతు నేను ప్రయత్నం చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, సూపర్వైజర్లు గుజ్జ విజయ కౌసల్య సింగ్,మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు రుక్సానా, చందన, ఇంద్రజ, హారిక, ధరణి,అమూల్య ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఒకరు పట్టివేత – ఆరుగురు పరారీ

**దమ్మపేట,మే 31(ప్రజాజ్యోతి);** దమ్మపేట మండల పరిధిలోని రంగువారిగూడెం గ్రామ శివారులో గల పామాయిల్ తోటలో కొందరు వ్యక్తులు అక్రమంగా పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు దమ్మపేట పోలీసు సిబ్బంది ఆకస్మికంగా దాడి నిర్వహించారు.పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే సరికి పేకాట ఆడుతున్న వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించగా, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. మిగిలిన ఆరుగురు వ్యక్తులు పరారీలో ఉన్నారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.ఘటనా స్థలంలో రూ.4,310 నగదు, 52 పేకముక్కలు, ఐదు మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, సంబంధిత వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు.అక్రమ జూద కార్యకలాపాలపై పోలీసుల నిఘా కొనసాగుతోందని, ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని దమ్మపేట ఎస్.ఐ రాజేష్ హెచ్చరించారు.

# యువత దారి ఎటు..?

- గంజాయి మత్తులో మునిగిపోతున్న భవిష్యత్తు
- సామాజిక మాధ్య మాల ప్రభావంలో దారి తప్పుతున్న కొత్త తరం
- చదువు, విలువలు, కుటుంబ బంధాలకు దూరమవుతున్న యువజనం





**కొత్తగూడెం, మే 31 ( ప్రజాజ్యోతి )** ఓ పాలబుగ్గల పసిపాప నీటి చినుకులతో ఆడుకుంటూ ఆనందపడే ఈ ప్రపంచం... నోటికాడ బువ్వ లేకున్నా చేతిలో ఫోన్ లేకపోతే జీవితం ఆగిపోయిందని భావించే స్థితికి చేరుకుంది అని సామాజిక వర్గాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఒకప్పుడు పిల్లలు పదో తరగతి పూర్తి చేస్తే తల్లిదండ్రుల గుండెల్లో ఆశల దీపాలు వెలిగేవి తమ పిల్లలు ఉన్నత విద్యలు అభ్యసించి మంచి స్థాయికి ఎదగాలని కలలు కనేవారు. కానీ నేటి సమాజంలో యువత అడుగులు వేస్తున్న దిశ ఆ కలలను క్రమంగా చీకటిలోకి నెడుతోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### ››› చదువుకంటే ఫోన్‌కే ఎక్కువ ప్రాధాన్యం

ప్రస్తుత కాలంలో విద్యాసంస్థలు కూడా పరోక్షంగా సాంకేతిక ఆధారిత జీవనశైలిని ప్రోత్సహిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పుస్తకాల కంటే మొబైల్ ఫోన్లతోనే ఎక్కువ సమయం గడిపే పరిస్థితి ఏర్పడింది. విద్యార్థులు గంటల తరబడి చేతి ఫోన్లలో ఏమి చూస్తున్నారు..? ఎవరితో మాట్లాడుతున్నారు..? ఎలాంటి సమాచారం సేకరిస్తున్నారు..? అనే అంశాలపై తల్లిదండ్రుల్లో ఆందోళన పెరుగుతోంది. సామాజిక మాధ్యమాలు యువతను తమ వలలో బంధిస్తున్నాయనే అభిప్రాయాలు బలపడుతున్నాయి. చిత్రవీక్షణ వేదికలు, స్నేహజాల మాధ్యమాలు, చిన్న వీడియోల ప్రపంచం యువతలో ఆలోచనా శక్తిని తగ్గిస్తూ వాస్తవ జీవితానికి దూరం చేస్తున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### ››› గంజాయి, మత్తు పదార్థాల వైపు యువత అడుగులు

మొబైల్ వాడకం ఒక వ్యసనం అనుకుంటే మరో పక్కన సమాజంలో గంజాయి, మత్తు పదార్థాల వినియోగం రోజురోజుకీ పెరుగుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఆన్‌లైన్ వ్యాపారాల పేరుతో కూడా మత్తు పదార్థాల సరఫరా జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్న వయసులోనే మత్తుకు బానిసవుతున్న యువత తమ భవిష్యత్తును తామే నాశనం చేసుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు ఏడో తరగతి చదివే విద్యార్థి బీడీ తాగితే ఆశ్చర్యపోయేవారు. ఇప్పుడు చిన్నారులే మద్యం, మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్న ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. చట్టపరంగా వయస్సు పరిమితులు ఉన్నప్పటికీ, బెల్టు దుకాణాల వద్ద చిన్నారులకు కూడా మద్యం అందుబాటులో ఉండటం సమాజానికి ప్రమాద సంకేతంగా మారిందని ప్రజలు అంటున్నారు.

### ››› చూపిస్తున్నది వినోదమా..? వినాశనమా..?

నేటి యువత ఏమి చూసి నేర్చుకోవాలి..? హత్యలు, దోపిడీలు, దురాగతాలు చూపించే దృశ్యాలా..? అశ్లీలతకు దగ్గరగా వెళ్లే వినోదాలా..? తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకుని జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకోవడమా.. సామాజిక మాధ్యమాల్లో కనిపించే ప్రతిదీ నిజం కాదని పెద్దలు హెచ్చరిస్తున్నారు. తాత్కాలిక వినోదం కోసం గంటల తరబడి ఫోన్లలో గడిపే యువత క్రమంగా కుటుంబ బంధాలకు, విలువలకు, బాధ్యతలకు దూరమవుతోందని సామాజిక విశ్లేషకులు పేర్కొంటున్నారు.

### ››› విలువలు కోల్పోతున్న కుటుంబ వ్యవస్థ

ఒకప్పుడు కుటుంబ బంధాలు, పెద్దల మాటలకు ఎంతో విలువ ఉండేది. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివాహ బంధాలు కూడా విలువ కోల్పోతూ విచిత్ర సంబంధాలుగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చిన్న చిన్న విభేదాలకే కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్న పరిస్థితులు పెరుగుతున్నాయని చెబుతున్నారు.

### ››› రాజకీయాలకు ఓట్లు ముఖ్యం.. సమాజ భవిష్యత్తు కాదు..?

యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతున్నా పాలక వర్గాలు పూర్తి స్థాయిలో స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై సమాచారం అందుతున్నప్పటికీ, పూర్తిస్థాయి నియంత్రణలో అధికారులు విఫలమవుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సమాజ భవిష్యత్తు కంటే రాజకీయాలకు ఓట్లే ముఖ్యమయ్యాయనే విమర్శలు ప్రజల్లో పెరుగుతున్నాయి. యువత దారి తప్పకుండా మార్గనిర్దేశం చేయాల్సిన బాధ్యత కుటుంబాలతో పాటు ప్రభుత్వాలపై కూడా ఉందని సామాజిక వర్గాలు చెబుతున్నాయి.

### ››› ఇప్పటికైనా మేల్కొనాలి యువత

సామాజిక మాధ్యమాల్లో కనిపించేదంతా నిజం కాదు. నిజమైన జీవితం మన ముందే ఉందని యువత గుర్తించాల్సిన అవసరం ఉంది. చదువు, క్రమశిక్షణ, కుటుంబ విలువలు, సమాజ పట్ల బాధ్యతే జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని పెద్దలు సూచిస్తున్నారు. తల్లిదండ్రుల కష్టాలు, వారి కలలు, కుటుంబ ఆశయాలను అర్థం చేసుకుని యువత ముందుకు సాగాలని కోరుతున్నారు. చినిగిన చొక్కా అయినా వేసుకో... కానీ మంచి పుస్తకం కొనుక్కో అన్న మహనీయుల మాటలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- 9 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్.. రూ.1.09 లక్షల నగదు స్వాధీనం
- వారం లో రెండు స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు




**ములకలపల్లి మే 31, ప్రజాజ్యోతి:** మండలంలోని ఆంధ్రా – తెలంగాణ సరిహద్దు గ్రామమైన తిమ్మంపేట శివారులో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 9 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.09 లక్షల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వారిలో బూర్గంపాడు మండలంకు చెందిన 7 మంది , ఇల్లందుకు చెందిన ఇద్దరు ఉన్నారు. ఈ ఘటనపై స్థానిక ఎస్సై మధుప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

**జూద స్థావరాలుగా మారుతున్న మండల సరిహద్దు గ్రామాలు ....**

మండల సరిహద్దు గ్రామాలు అక్రమ జూద కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోడిపందాలు, పేకాట స్థావరాల్లో లక్షల రూపాయల లావాదేవీలు జరుగుతున్నప్పటికీ స్థానిక పోలీసులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. వారం రోజుల్లో ధర్మన్ననగర్, తిమ్మంపేట ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వరుసగా దాడులు నిర్వహించారు. గత వారం ధర్మన్ననగర్‌లో కోడిపందాల స్థావరంపై జరిగిన దాడిలో కోడిపుంజులు, నగదు, వాహనాలు స్వాధీనం చేసుకోగా, ఆదివారం తిమ్మంపేటలో పేకాట స్థావరంపై నిర్వహించిన దాడిలో 9 మంది పట్టుబడి రూ.1.09 లక్షల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం అయ్యాయి. మండలంలోని ఇతర సరిహద్దు గ్రామాల్లో కూడా అక్రమ జూద స్థావరాలు ఏర్పాటు చేసి కోడిపందాలు, పేకాట నిర్వహిస్తూ లక్షల రూపాయల పందాలు కాస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా సెలవులు, పండుగల సమయంలో ఈ కార్యకలాపాలు మరింత జోరుగా సాగుతున్నాయని చెబుతున్నారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు వరుసగా దాడులు నిర్వహిస్తున్నప్పటికీ స్థానిక పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ జూద కార్యకలాపాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## సెక్రటరీ కృష్ణ కు ఘన వీడ్కోలు




**ములకలపల్లి, మే 31 ప్రజాజ్యోతి:** మండలం లోని రాచన్నగూడెం గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళుతున్న కార్యదర్శి కృష్ణకు గ్రామ సర్పంచ్ మడకం విజయ, గ్రామ పెద్దలు, పాలకవర్గ సభ్యులు, అంగన్ వాడీ మరియు ఆశా కార్యకర్తలు ఘనంగా వీడ్కోలు పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మడకం విజయ మాట్లాడుతూ, కనీసం మొబైల్ సిగ్నల్ కూడా సరిగా అందని ప్రాంతంలో గత నాలుగు సంవత్సరాలుగా కృష్ణ గ్రామపంచాయతీ అభివృద్ధికి విశేష సేవలు అందించారని తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, గ్రామంలో నిరంతర శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల ఆరోగ్య భద్రతకు అండగా నిలిచారని కొనియాడారు. గత రెండు సంవత్సరాలుగా సర్పంచ్ లు లేకపోయినా గ్రామంలో మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి సమస్యలు తలెత్తకుండా కార్యదర్శి సమర్థవంతంగా పనిచేశారని ప్రశంసించారు. గ్రామాభివృద్ధిలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఉపసర్పంచ్ వగ్గెల వెంకటేష్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ కొర్సా గణపతి, పాత్రికేయుడు కుంజా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో పని చేస్తా...

- సంఘాన్ని బలోపేతం చేస్తా...కంచర్ల భాస్కర రావు ఛాంబర్ కామర్స్ అధ్యక్షులు
- కంచర్ల భాస్కరరావు ప్రమాణస్వీకారం
- కార్యదర్శిగా తడికమల్ల చంద్రశేఖర్... కోశాధికారిగా ఉప్పల పవన్ కుమార్





**అశ్వారావుపేట, మే 31, ప్రజాజ్యోతి :** వ్యాపారులందరినీ సమన్వయంతో కలుపుకుని పనిచేస్తు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కంచర్ల భాస్కరరావు అన్నారు. భద్రాచలం రోడ్ లోనే శ్రీ శ్రీ కళ్యాణ మండపంలో అశ్వారావుపేట చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడుగా కంచర్ల భాస్కరరావు, కార్యదర్శిగా తడికమల్ల చంద్రశేఖర్, కోశాధికారిగా ఉప్పాల పవన్ కుమార్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ, సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి పనిచేస్తానన్నారు. నూతన కమిటీ సభ్యులు కూడా తమ పదవులకు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు, ప్రముఖులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపార వర్గాల ఐక్యతతో అశ్వారావుపేట ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య,పలువురు వ్యాపారులు, సంఘ సభ్యులు,పాల్గొన్నారు.

## విద్యార్థినిలకు సైకిల్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోరం



**టేకులపల్లి,మే31,ప్రజాజ్యోతి:** లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సైకిల్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య పాల్గొన్ని, విద్యార్థినీలకు సైకిల్ ఎమ్మెల్యే కోరం కనకయ్య పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాభ్యాసంలో మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు.గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులు పాఠశాలకు సులభంగా చేరుకోవడానికి ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు.లయన్స్ క్లబ్ ఆఫ్ టేకులపల్లి అధ్యక్షులు కేశ వేణుగోపాలరావు మాట్లాడుతూ సమాజ సేవే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని, విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమ రంగాల్లో క్లబ్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. క్లబ్ కార్యదర్శి తోటకూరి సందీప్ కుమార్ కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించి, లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. ట్రెజరర్ వీరభద్రం, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బొడ్డుపల్లి బ్రహ్మచారి కార్యక్రమం విజయవంతానికి విశేషంగా కృషి చేశారు. సేవాభావంతో కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విద్యార్థినులకు ప్రోత్సాహాన్ని అందించారు.విద్యార్థినుల విద్యాభివృద్ధికి, వారి భవిష్యత్ ఉన్నతికి తోడ్పడే ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగిలాల్ , కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఈది గణేష్, ఇస్లావత్ రెడ్డి నాయక్, సంజయ్, క్లబ్ సభ్యులు బండ్ల శ్రీనివాస్, బండ్ల రజిని, అంబాల బాలయ్య,అంబాల మయూరి,ఆర్ఎం నరసింహా రావు, ఉపేందర్రావు,నర్సింగ్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ సేవల్లో ఆదర్శప్రాయుడు కుంటా శ్రీనివాస్

- **భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం**



**భద్రాచలం, మే 31, ప్రజా జ్యోతి:** భద్రాచలం కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా గత రెండేళ్లకు పైగా సమర్థవంతంగా, పారదర్శకంగా సేవలందించిన కుంటా శ్రీనివాస్ సాధారణ బదిలీలో భాగంగా జగిత్యాల కోర్టుకు బదిలీ కావడంతో, భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ వీడ్కోలు, సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి మాట్లాడుతూ, కుంటా శ్రీనివాస్ తన పదవీకాలంలో వృత్తిపరమైన నిబద్ధత, నిజాయితీ, పారదర్శకతతో విధులు నిర్వహించి న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. క్లిష్టమైన కేసుల నిర్వహణలోనూ ఆయన చూపిన నైపుణ్యం, న్యాయ వ్యవస్థ పట్ల ఉన్న అంకితభావం ప్రశంసనీయమని కొనియాడారు.అనంతరం పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ, శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆశీస్సులతో కుంటా శ్రీనివాస్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించి న్యాయ వ్యవస్థకు విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. భద్రాచలంలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.కార్యక్రమం ముగింపులో కుంటా శ్రీనివాస్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సున్నం రమేష్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, జాయింట్ సెక్రటరీ తాతా లలిత, లేడీ రిప్రెసెంటేటివ్ ఎం. తరుణి, సీనియర్ న్యాయవాదులు కే. శ్రీమన్నారాయణ, గుడపర్తి నాగరాజు, సి.హెచ్.ఎన్. అంబేద్కర్, పామరాజు తిరుమలరావు, దాట్ల సంధ్య, సౌజన్య తదితర న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

**ఒకప్పుడు ఆసుపత్రి గదులకే పరిమితమైన వైద్యులు.. ఇప్పుడు మొబైల్ స్క్రీన్లలోనూ ప్రజలకు చేరువవుతున్నారు. చికిత్సతో పాటు చైతన్యం, మందులతో పాటు మార్గదర్శనం, సేవతో పాటు సోషల్ మీడియా సాన్నిహిత్యం అనే కొత్త దారిని ఎంచుకుంటున్నారు. ఆరోగ్యంపై అపోహలను చెరిపేస్తూ, వ్యాధులపై అవగాహన కల్పిస్తూ, సరదా వీడియోలతో యువతను ఆకట్టుకుంటూ, సామాజిక అంశాలపై స్పందిస్తూ జిల్లా వ్యాప్తంగా యువ డాక్టర్లు డిజిటల్ ప్రపంచంలో కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుడుతున్నారు. 'రోగి దగ్గరకు డాక్టర్ రావడం' నుంచి 'ప్రజల ఫోన్‌లోకి డాక్టర్ చేరడం' వరకు మారుతున్న కాలానికి అద్దం పడుతున్న ఈ పరిణామంపై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి
(భూక్యా రంజిత్ రంజిత్)



# రీల్ చేస్తేనే రీచ్..!

### డాక్టర్లకు దొరికిన కొత్త టీచ్..!

- రోగులకు మందులు, నెటిజన్లకు సందేశాలు
- డాక్టర్ల డిజిటల్ జోరు, రీల్స్ తో హోరు
- జిల్లా వ్యాప్తంగా డాక్టర్ల రీల్స్‌కు ఫుల్ క్రేజ్..!

కాలం మారుతోంది... కమ్యూనికేషన్ మారుతోంది... ప్రజలకు సమాచారం అందించే మార్గాలు కూడా వేగంగా రూపాంతరం చెందుతున్నాయి. ఈ మార్పును అర్థం చేసుకున్న యువ వైద్యులు ఇప్పుడు సోషల్ మీడియాను ప్రజారోగ్య వేదికగా మార్చేస్తున్నారు. ఒకప్పుడు వైద్య సలహా కోసం ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అదే సలహా కొన్ని సెకన్ల వీడియో రూపంలో ప్రజల మొబైల్ ఫోన్‌లోకి చేరుతోంది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ముఖ్యంగా కొత్తగూడెం, భద్రాచలం, పాల్వంచ, మణుగూరు, ఇల్లందు వంటి పట్టణాల్లో పనిచేస్తున్న యువ వైద్యులు సోషల్ మీడియా ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్, ఫేస్‌బుక్ వీడియోలు, వాట్సాప్ స్టేటస్‌ల ద్వారా ప్రజలకు ఆరోగ్య చిట్కాలు, జీవనశైలి మార్పులు, మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్, ఊబకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు.

### ఆరోగ్యానికి అవగాహనే ఆయుధం

చాలా వ్యాధులు మందుల కంటే ముందుగా అవగాహన లేకపోవడం వల్లే పెరుగుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఎక్కువ సమయం గడిపే సోషల్ మీడియా వేదికలనే అవగాహన సాధనంగా మార్చుకుంటున్నారు యువ డాక్టర్లు. "జ్వరం వచ్చినప్పుడు ఏం చేయాలి?", "షుగర్ రోగులు ఏ ఆహారం తీసుకోవాలి?", "బీపీ ఎందుకు వస్తుంది?", "గుండె పోటు ముందస్తు లక్షణాలు ఏమిటి?" వంటి అంశాలను సామాన్యులకు అర్థమయ్యే భాషలో వివరిస్తున్నారు.

### ››› చైతన్యం... వినోదం... రెండూ కలిపే ప్రయత్నం

కేవలం వైద్య విషయాలకే పరిమితం కాకుండా పర్యావరణ పరిరక్షణ, రోడ్డు భద్రత, రక్తదానం, అవయవదానం, మహిళల ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం వంటి సామాజిక అంశాలపై కూడా వీడియోలు రూపొందిస్తున్నారు. మరోవైపు యువతను ఆకర్షించేందుకు సరదా స్కిట్లు, ఫన్నీ వీడియోలు, ట్రెండింగ్ రీల్స్ శైలిలో ఆరోగ్య సందేశాలను అందిస్తున్నారు. "చెప్పే మాట కంటే చూపించే వీడియో ప్రభావం ఎక్కువ" అన్న సామెతకు తగ్గట్టుగా నిమిషం నిడివి గల వీడియోల ద్వారానే వేల మందికి చేరువవుతున్నారు.

### ఏజెన్సీ ప్రాంతాల్లోనూ ప్రభావం

ముఖ్యంగా భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో ఆరోగ్య అవగాహన కొంత తక్కువగా ఉండే నేపథ్యంలో ఈ వీడియోలు మంచి ప్రభావం చూపుతున్నాయని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ఆసుపత్రికి రాకముందే ప్రాథమిక సమాచారం ప్రజలకు చేరుతుండటంతో అపోహలు తగ్గుతున్నాయని అభిప్రాయపడుతున్నారు.

### ››› కొత్త తరం వైద్య సేవలకు కొత్త దారి

ఒకప్పుడు డాక్టర్ అంటే కేవలం ఆసుపత్రిలో కనిపించే వ్యక్తి. ఇప్పుడు సోషల్ మీడియా ద్వారా ప్రతిరోజూ ప్రజలతో మాట్లాడే స్నేహితుడిగా మారుతున్నాడు. చికిత్స చేయడమే కాకుండా వ్యాధులు రాకుండా నివారించడం కూడా వైద్యుడి బాధ్యత అనే భావనతో ఈ తరం యువ వైద్యులు ముందుకు సాగుతున్నారు.

"ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెరగాలంటే వారు ఉన్న చోటికే మనం వెళ్లాలి. ఇప్పుడు ఎక్కువ మంది సోషల్ మీడియాలోనే ఉంటున్నారు. అందుకే చిన్న చిన్న వీడియోల ద్వారా ఆరోగ్య సూచనలు అందిస్తున్నాం. ఒక వీడియో చూసి అయినా ఒక్కరు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటే అదే మాకు పెద్ద సంతృప్తి."



**డాక్టర్. చారుగుళ్ళ స్పందన**
**( స్త్రీ వైద్య నిపుణులు )**

"సోషల్ మీడియా కేవలం వినోదం కోసమే కాదు. సరైన సమాచారం అందిస్తే అది ప్రజారోగ్యానికి కూడా ఉపయోగపడుతుంది. మేము చేసే వీడియోల వల్ల చాలా మంది వ్యాధుల లక్షణాలను ముందుగానే గుర్తించి వైద్యులను సంప్రదిస్తున్నారని చెప్పడం ఆనందంగా ఉంది. డిజిటల్ యుగంలో వైద్య సేవలకు ఇది కొత్త విస్తరణ."



**డాక్టర్. హేమంత్ కాకర్ల**
**( ఆర్థోపెటిక్ వైద్య నిపుణులు )**

స్టెతస్కోప్ నుంచి సోషల్ మీడియా వరకు సాగుతున్న ఈ కొత్త ప్రయాణం... భద్రాద్రి జిల్లాలో ఆరోగ్య చైతన్యానికి కొత్త ఊపిరి పోస్తోందనే చెప్పాలి.



**డాక్టర్ రమేష్ చంద్ర**
**( ప్రముఖ వైద్యులు )**



- నిధులు విడుదల... నిర్మాణం నిలిచి పోవడమేలా ?
- భక్తుల కలలకు ప్రభుత్వం తోడు
- వైదిక ప్రక్రియలు పూర్తి
- అభివృద్ధి మాత్రం పెండింగ్
- టెండర్ల వద్దే ఆగిన అభివృద్ధి రథం
- వర్షాకాలం ముందే మొదలవుతాయా పనులు ?
- పుష్కరాల నాటికి లక్ష్యం చేరుతుందా ?
- ఆర్ అండ్ బి శాఖపై పెరుగుతున్న అంచనాలు
- రామభక్తుల చూపు భద్రాద్రిపైనే





# టెండర్ జరిగితేనే వండర్..

దేవతలు కదిలారు... కానీ యంత్రాలు కదల్లేదు. నిధులు విడుదలయ్యాయి... కానీ నిర్మాణం మొదలుకాలేదు. దక్షిణ అయోధ్యగా ఖ్యాతిగాంచిన భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని దేశంలోనే అత్యున్నత ఆధ్యాత్మిక కేంద్రాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చరిత్రలోనే భారీ అభివృద్ధి ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. కోట్లాది రూపాయల నిధులను కేటాయించింది. స్థల సేకరణ పూర్తి చేసింది. శాస్త్రోక్తంగా జీర్ణోద్ధరణ అనుజ్ఞ కార్యక్రమాలు నిర్వహించింది. ఉపాలయాల్లోని దేవతా మూర్తులను సైతం ప్రత్యేక ప్రాంగణానికి తరలించింది. అయితే అభివృద్ధి పనులకు సంబంధించిన అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తయినప్పటికీ అసలు నిర్మాణ పనులు మాత్రం ఇంకా ప్రారంభం కాకపోవడం రామభక్తులను ఆందోళనకు గురిచేస్తోంది. ఒకవైపు టెండర్ల ప్రక్రియలో జాప్యం, మరోవైపు సమీపిస్తున్న వర్షాకాలం, ఇంకోవైపు మరో ఏడాదిలో జరగనున్న గోదావరి పుష్కరాలు... ఈ పరిణామాలన్నీ కలిసివచ్చి భద్రాద్రి అభివృద్ధి పనుల భవిష్యత్తుపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన గడువులో పనులు పూర్తవుతాయా? పుష్కరాల నాటికి భక్తులకు నూతన భద్రాద్రి దర్శనమిస్తుందా? లేక ఆశలు మరోసారి వాయిదా పడతాయా? అనే చర్చ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సాగుతోంది. ఈ అంశంపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి
(భూక్యా రంజిత్ రంజిత్)

దక్షిణ అయోధ్యగా ఖ్యాతిగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం అభివృద్ధి కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రామభక్తుల కల సాకారమవుతున్నట్టే కనిపించినా.. ప్రస్తుతం అభివృద్ధి పనుల ప్రారంభంలో ఏర్పడిన జాప్యం భక్తుల్లో కొత్త ఆందోళనకు దారితీస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం చరిత్రలోనే అత్యంత భారీ స్థాయిలో నిధులు కేటాయించి, స్థల సేకరణ పూర్తి చేసి, వైదిక ప్రక్రియలను ముగించి, పనుల బాధ్యతలను ఆర్ అండ్ బి శాఖకు అప్పగించినప్పటికీ.. క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. భద్రాచలం ఆలయానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. శ్రీరాముని కల్యాణం, వైకుంఠ ఏకాదశి, గోదావరి పుష్కరాల వంటి మహోత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తుంటారు.

అయితే పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు, పార్కింగ్, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, ఘాట్లు, ఇతర మౌలిక సదుపాయాలు విస్తరించాల్సిన అవసరం ఉందని రామభక్తులు చాలా కాలంగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం భద్రాద్రి అభివృద్ధిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. యాదాద్రి తరహాలో భద్రాచలాన్ని కూడా దేశంలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో భారీ ప్రణాళికకు శ్రీకారం చుట్టింది.

### »» రూ.586 కోట్ల మాస్టర్ ప్లాన్

భద్రాచలం అభివృద్ధి కోసం ప్రభుత్వం మొత్తం రూ.586 కోట్ల మాస్టర్ ప్లాన్ రూపొందించింది. ఇందులో తొలి విడతగా రూ.351 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, గోదావరి ఘాట్ల అభివృద్ధి, భక్తుల కోసం ఆధునిక సదుపాయాల కల్పన, పరిసర ప్రాంతాల అభివృద్ధి, క్యూలైన్ల విస్తరణ, విశ్రాంతి గదుల నిర్మాణం, దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక సౌకర్యాలు వంటి పనులు చేపట్టనున్నారు.

### »» స్థల సేకరణ నుంచి శంకుస్థాపన వరకు

అభివృద్ధి పనులకు అవసరమైన భూములను ప్రభుత్వం ఇప్పటికే సేకరించింది. ఇటీవల జరిగిన శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా భద్రాచలం చేరుకుని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. దీంతో భక్తుల్లో కొత్త ఆశలు చిగురించాయి. భద్రాద్రి రూపురేఖలు త్వరలోనే మారిపోతాయని అందరూ భావించారు.

### »» చరిత్రలో అరుదైన వైదిక కార్యక్రమం

అభివృద్ధి పనులు ప్రారంభించే ముందు ఆలయ ఆగమ శాస్త్ర నియమాలకు అనుగుణంగా ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో ప్రధాన ఆలయం పరిధిలోని 15 ఉపాలయాల్లో ఉన్న 72 దేవతామూర్తులకు కళావాహన కార్యక్రమం నిర్వహించి వాటిని తాత్కాలికంగా ఇతర ప్రదేశాలకు తరలించారు. భద్రాద్రి చరిత్రలో ఒకేసారి ఇంత పెద్ద స్థాయిలో కళావాహన, జీర్ణోద్ధరణ కార్యక్రమాలు నిర్వహించడం అరుదైన ఘట్టంగా వైదిక పండితులు పేర్కొంటున్నారు.

### »» బాధ్యతలు ఆర్ అండ్ బి శాఖకు

అభివృద్ధి పనుల అమలును రాష్ట్ర ప్రభుత్వం ఆర్ అండ్ బి శాఖకు అప్పగించింది. దేవస్థానం అధికారులు కూడా అభివృద్ధి చేయాల్సిన ప్రాంతాలను గుర్తించి, సాంకేతిక వివరాలు, స్థలాల హస్తాంతరణ వంటి ప్రక్రియలను పూర్తి చేశారు. దీంతో నిర్మాణ పనులు వెంటనే ప్రారంభమవుతాయని అందరూ భావించారు.

### »» టెండర్లలో స్పందన లేక జాప్యం

అయితే ఇక్కడే అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఆర్ అండ్ బి శాఖ అధికారులు ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించినప్పటికీ మొదటి విడత టెండర్లకు ఆశించిన స్పందన రాలేదు. కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో టెండర్ల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో అధికారులు మరోసారి టెండర్లను ఆహ్వానించారు. ప్రస్తుతం రెండో విడత టెండర్ల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ ప్రక్రియపై అందరి దృష్టి నెలకొంది.

### »» వర్షాకాలం మరో సవాల్

ఇప్పటికే మే నెల ముగింపుకు చేరుకుంటుండగా జూన్ నుంచి వర్షాకాలం ప్రారంభం కానుంది. భద్రాచలం గోదావరి నది తీర ప్రాంతంలో ఉండటంతో ప్రతి ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో వరదల ప్రభావం కనిపిస్తుంది. భారీ వర్షాలు, గోదావరి వరదల కారణంగా నిర్మాణ కార్యకలాపాలు మందగించే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా పనులు ప్రారంభం కాకపోతే నిర్మాణ గడువు మరింత పెరిగే అవకాశముందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### »» పుష్కరాల సమయానికి పూర్తి అవుతాయా ?

ఇదే ప్రస్తుతం రామభక్తులను ఎక్కువగా కలవరపెడుతున్న ప్రశ్న. రాబోయే ఏడాది గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు భద్రాచలానికి తరలివచ్చే అవకాశం ఉంది. పుష్కర స్నానంతో పాటు భద్రాద్రి రాముని దర్శించుకోవడం భక్తులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. అలాంటి సమయంలో అభివృద్ధి పనులు పూర్తికాకపోతే భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### »» ప్రభుత్వంపై భక్తుల ఆశలు

మరోవైపు ప్రభుత్వం భద్రాద్రి అభివృద్ధి విషయంలో చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోందని అధికార పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే భారీ నిధులు విడుదల చేయడం, స్థల సేకరణ పూర్తి చేయడం, వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించడం ఇందుకు నిదర్శనమని చెబుతున్నారు. ఇప్పుడు మిగిలింది నిర్మాణ పనులను వేగవంతం చేయడమేనని, టెండర్ల ప్రక్రియ త్వరగా పూర్తై పనులు ప్రారంభమైతే పుష్కరాల నాటికి కనీసం తొలి విడత అభివృద్ధి పనులు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు.

### »» అందరి చూపు టెండర్లపైనే

భద్రాద్రి అభివృద్ధి అనేది కేవలం ఒక నిర్మాణ ప్రాజెక్టు కాదు. కోట్లాది రామభక్తుల ఆధ్యాత్మిక భావోద్వేగాలతో ముడిపడిన మహత్తర యజ్ఞం. ప్రభుత్వం ఇప్పటికే కీలక నిర్ణయాలు తీసుకుని ముందడుగు వేసినప్పటికీ, ఇప్పుడు అందరి చూపు టెండర్ల ప్రక్రియపైనే ఉంది. జూన్ 8వ తేదీ నాటికి టెండర్ల గడువు ముగుస్తుండడంతో రెండో విడత టెండర్లకు స్పందన ఎలా ఉంటుందో, పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో, రాబోయే గోదావరి పుష్కరాల నాటికి భద్రాద్రి కొత్త రూపంలో భక్తులకు దర్శనమిస్తుందో లేదో కాలమే సమాధానం చెప్పాల్సి ఉంది.




